సంపాదకీయం

# ఆలస్యానికి సంజాయిషీతో ....

రెండు సంవత్సరాల గడువు తరువాత 8వ బులెటిన్‌ను పాఠకుల ముందు ఉంచుతున్నాం. సామాజిక పరిస్థితులు వేగంగా మారుతున్నందున ఆరు నెలలకొక బులెటిన్ తీసుకు రాగలిగితే మారుతున్న ఆ పరిస్థితులపైన హక్కుల కోణం నుంచి ఒక రన్నింగ్ కామెంటరీగా ఉండేది. ఉండాలనే మా ప్రయత్నం. రాబోయే రోజులలో దాన్ని సాధించేందుకు కృషి చేస్తాం.

**ప్రత్యేక ఆర్థిక మండలుల** మీద ఈ బులెటిన్‌లో వివరమైన వ్యాసం ఉంది. మార్చి 14న పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రాంలో ప్రత్యేక ఆర్థిక మండలి వద్దంటున్న జనం మీద కాల్పులు జరిపి 14 మందిని చంపిన విషయం మీకు తెలుసు. ప్రజల సమ్మతి లేకుండా కొత్త ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పే ఉద్దేశం తమకు లేదని ఆ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న వామపక్ష ప్రభుత్వం స్పష్టం చేసినా కూడా ప్రతిపక్ష పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్, ముస్లిం మతవాద సంస్థలు, నక్సలైట్లు మొండిగా సాధారణ పరిపాలన సహితం సాగనివ్వకుండా అడ్డుపడుతున్నారనీ, సిపిఐ (ఎం) పార్టీకి చెందిన వారిపైన భౌతిక దాడులు చేసి తరిమేశారనీ, పాలనా యంత్రాంగాన్ని పునరుద్ధరించడానికీ చట్టబద్ధ పాలనను తిరిగి నెలకొల్పడానికీ సిపిఐ (ఎం) కార్యకర్తలూ నాయకులూ తిరిగి గ్రామంలోకి ప్రవేశించడానికీ, పోలీసులను రంగంలోకి దించక తప్పలేదనీ వామపక్ష ప్రభుత్వం ఆ కాల్పులను సమర్థించుకుంది.

అంతా నిజమే అనుకున్నా, ప్రజలు మూర్ఖంగానే అడ్డుపడుతున్నారని అనుకున్నా, వారు మొండిగా ఉన్నప్పుడు బలవంతంగా పోలీసులను దించి రక్తపాతం

సృష్టించవలసిన అవసరం ఏమొచ్చింది? ఎట్లాగూ ప్రజలు ఒప్పుకోనిదే ప్రత్యేక ఆర్థిక మండలి నెలకొల్పం అంటున్నప్పుడు తొందరేమొచ్చింది?

నిజానికి నందిగ్రాం పశ్చిమ బెంగాల్‌ను ఏలుతున్న వామపక్ష కూటమికి పూర్తి బలం ఉన్న ప్రాంతమే. స్థానిక ఎంఎల్ఏ, స్థానిక ఎం.పి వామపక్షాలకు చెందినవారే. మూడంచెల పంచాయితి రాజ్ వ్యవస్థలోని మెజారిటీ పదవులు పాలక కూటమికి చెందిన వారే గెలుచుకున్నారు. అటువంటి చోట ప్రజలంతా ప్రతిపక్షాలు, మతతత్వ శక్తులు, నక్సలైట్ల దుష్ప్రచారాన్ని నమ్మి విచక్షణ కోల్పోతారంటే నమ్మడం అంత సులభం కాదు. పాలక కూటమి అనుచరులు సహితం ప్రత్యేక ఆర్థిక మండలి వద్దంటే వద్దని అంటుండగా నాయకులు ఒంటరి అయ్యారని వింటున్నాం.

ఆ నాయకుల మీద భౌతిక దాడులు జరిగాయనీ, వారు తమ ఊర్లూ ఇళ్ళూ విడిచిపెట్టి వెళ్ళిపోయారనీ వామపక్ష నేతలు అంటున్నారు. అవుననే అనుకుందాం. మెజారిటీ ఓట్లు పొంది గెలుపొందిన వారు అక్కడ ఉండలేని పరిస్థితి ఏర్పడితే అది దౌర్జన్యమే అయినప్పటికీ ఎక్కడో ఏదో తప్పు జరిగిందని అర్థం చేసుకోవడం సబబు కాదా? దాని బదులు ఆ నాయకులను వెనక్కి తీసుకుపోయి దింపి రావడాన్ని ప్రెస్టీజ్‌కు సంబంధించిన విషయంగా తీసుకోవడం ఉచితమా? పోలీసుల మోహరింపు వెనక ఉన్నది ఈ 'ప్రెస్టీజ్' కాదా?

కాల్పులు జరిపింది పోలీసులు మాత్రమే కాదనీ ఖాకీ దుస్తులలో ఉన్న సిపిఐ (ఎం) కార్యకర్తలూ ఉన్నారనీ వింటున్నాం. ఇది కొత్త విషయం కాదు. పశ్చిమ బెంగాల్‌లో సిపిఐ (ఎం) నాయకత్వంలోని వామపక్ష కూటమి అవిచ్ఛిన్నంగా గెలుస్తుండడం వెనుక వారు ప్రజలకు చేసిన మేలు ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ, వారి కేడర్ గ్రామాలలో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించి ప్రత్యర్థులను టెర్రరైజ్ చేయడమూ వాస్తవమేనని ఆ రాష్ట్రానికి చెందిన ప్రజాతంత్ర శక్తుల నుంచి చాలా కాలంగా వింటున్నాం. పాలనా యంత్రాంగానికీ సిపిఐ (ఎం)కూ తేడా చెరిగిపోయిందనేది అభియోగం. నందిగ్రాం దానిని రుజువు చేసింది.

దేశంలోకి భారీగా పెట్టుబడులను ఆహ్వానించడానికి గ్రామాలకు గ్రామాలు ఖాళీచేసి అన్ని హంగులూ ఉన్న విశాల క్షేత్రాలను విస్తరిలో పెట్టి అనేక రాయితీలతో పాటు పెట్టుబడిదారీ కంపెనీలకు అప్పగించే ఆలోచనకు గ్రామీణ ప్రాంతాలలో ప్రతిఘటన బలంగా వస్తుందనడానికి నందిగ్రాం ఒక సూచిక. అయితే దానినుంచి ఎవరూ ఏమీ నేర్చుకుంటున్నట్టు కనబడదు. ఈ ఏప్రిల్ నెల రెండవ వారంలో ముంబాయి నుంచి ఢిల్లీకి ఒక ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుచేసే ఒప్పందం జపాన్‌కు చెందిన కంపెనీలతో జరిగిందని పత్రికలు రాశాయి. ఆ కారిడార్‌లో ఒకటికాదు పలు ప్రత్యేక ఆర్థిక మండలులు ఉంటాయంట. ఇంకా అంతర్జాతీయ

విమానాశ్రయాలూ, అత్యాధునికమైన ఓడరేవూ ఉంటాయంట. ఇది ఎంత ప్రతిఘట నకు దారితీస్తుందో ఎన్ని ప్రాణాలు బలి తీసుకుంటుందో వేచి చూడాలి.

**రిజర్వేషన్ల పట్ల** సుప్రీంకోర్టు అనుసరిస్తున్న అనుచిత వైఖరి గురించి కూడా ఈ బులెటిన్‌లో ఒక వ్యాసం ఉంది. నాగరాజ్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా అనే కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును సమీక్షించే వ్యాసం ఇది. సుప్రీంకోర్టు వైఖరిలో వ్యక్తమవుతున్న భావదారిద్ర్యం గురించి అందులో ప్రస్తా వించాము.

ఈ లోపల ఆ వైఖరిని సుప్రీంకోర్టు మరొకసారి ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం అజమాయిషీలోని ఉన్నత విద్యాసంస్థలలో ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటు చేసిన చట్టాన్ని స్టే చేసింది. రేపటి సంగతేమో గానీ ఈ విద్యా సంవత్స రాన్ని ఒబిసిలు కోల్పోయినట్టే. 1931 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్లు ఎట్లా ఇస్తారని సుప్రీంకోర్టు అడిగిందంట. జనాభా లెక్కల ఆవశ్యకత ఒబిసిల దామాషా నిర్ణయించడానికే తప్ప సంఖ్య నిర్ణయించే దానికి కాదు కదా. ఒబిసిలదైనా, వేరే ఎవరిదైనా జనాభా నిష్పత్తి 1931కీ, నేటికీ గణనీయంగా మారి ఉంటుందని న్యాయ మూర్తులు అనుకుంటున్నారా? ఒకవేళ మారినా పెరిగి ఉంటుంది తప్ప తగ్గి ఉండదు – ఎందుకంటే ఒబిసిలు సగటున అగ్రకులాల కంటే పేదలనేది అందరూ ఎరిగిన వాస్తవమే. భారతదేశ జనాభాలో పేదల జనాభా పెరుగుదల రేటు ఉన్న వాళ్ళతో పోలిస్తే సాపేక్షంగా కొంచెం ఎక్కువనేది కూడా తెలిసిన విషయమే. మరయితే 1931 లెక్కల పైన ఆధారపడడం వల్ల ఒబిసిల కోటా తగ్గి ఉంటుందేమో గానీ మించిపోయి ఉండే అవకాశం లేదు కదా!

సామాజిక వర్గాలు తాము వెనుకబడే ఉన్నామని రుజువు చేసుకోవడానికి లైను కట్టే దేశం ప్రపంచంలో మరెక్కడా లేదని సుప్రీంకోర్టు అపహాస్యం చేసిందంట. సామాజిక విషయాల గురించి మాట్లాడేటప్పుడు బజారు స్థాయి వ్యాఖ్యలను దాటిపో లేనితనాన్ని న్యాయస్థానాలు ప్రదర్శించడం మన అనుభవంలోని విషయమే. అటు వంటి విషయాలలో జరుగుతున్న తాత్విక, రాజకీయ సంవాదం గురించి సాధారణ దినపత్రికల పాఠకులకు ఉండే పాటి జ్ఞానం కూడా లేకుండా మాట్లాడుతుంటారు. అన్ని రాష్ట్రాలలోనూ తమను వెనుకబడిన వర్గంగా గుర్తించమని రాష్ట్ర ప్రభుత్వానికి అర్జీపెట్టుకున్న సామాజిక వర్గాలు ఉన్నాయి. ఆ అర్జీలు విచారణలో ఉన్నాయి. అందులో ఎన్ని అర్జీలు బలిసిన వర్గాలు కేవలం రిజర్వేషన్ పొందడం కోసం ఒబిసి ముద్ర వేయించుకునే ఆరాటంలో పెట్టుకున్నవో న్యాయమూర్తులు తెలుసుకునే ప్రయత్నం చేశారా? నీ దగ్గర ఏం సమాచారం ఉంది అని ప్రభుత్వాన్ని దబాయి స్తున్నారు. కాని వారి దగ్గర ఏం సమాచారం ఉందని ఈ రకమైన వ్యాఖ్యలు చేస్తు

న్నారు? అయినా, ప్రపంచంలో వేరే ఎక్కడన్నా పుట్టుక ప్రాతిపదికన మనుషులకు అభివృద్ధి పొందే అవకాశాలను నిరాకరించిన సమాజం ఉందా? సిగ్గుపడవలసింది దానికా లేక వెనుక ఉంచబడ్డవాళ్ళు సమాన అవకాశాలు కోరుతున్నందుకా?

అందరినీ ఏవేవో ప్రశ్నలు వేస్తూ, అందరికీ ఏవేవో సవాళ్ళు విసురుతున్న సుప్రీంకోర్టు తనకు తాను ఒక ప్రశ్న వేసుకోవలసి ఉంది. ఈ (దాదాపు) 60 సంవత్సరాలలో ఎంతమంది ఒబిసిలు సుప్రీంకోర్టు జడ్జీలయ్యారు? మాకు తెలిసి రత్నవేల్ పాండ్యన్ అనే తమిళనాడుకు చెందిన ఒక న్యాయమూర్తి మాత్రమే సుప్రీం కోర్టును అందుకున్న ఒబిసి. ఇంకొకరో ఇద్దరో ఉన్నారనుకుందాం. దేశ జనాభాలో సగానికి తక్కువలేని ప్రజల నుంచి ఆరు దశాబ్దాల కాలంలో ఇద్దరు ముగ్గురు మాత్రమే సుప్రీంకోర్టు జడ్జీలు కాగలిగారంటే ఎక్కడో ఏదో తీవ్రలోపం ఉన్నట్టు అను కోనవసరం లేదా? సమాజంలోనే ఉందందామా, జడ్జీల ఎంపికలో ఉందందామా – ఏదో ఒకటైతే అనక తప్పదు కదా? అదే కాలంలో సుప్రీంకోర్టు జడ్జిలలో బ్రాహ్మణు లెంతమంది ఉన్నారో లెక్కతీస్తారా? ఎప్పుడైనా దాదాపు సగం బ్రాహ్మణులే కారా? బ్రాహ్మణులతో పాటు కాయస్త, కరణ్, వైద్, వైశ్య, రాజ్‌పుట్ లాంటి 'ద్విజుల'ందరినీ కలుపుకుంటే సుప్రీంకోర్టులో అత్యధిక శాతం న్యాయమూర్తులు వారే కదా? కనీసం 30 సంవత్సరాలుగా మన రాష్ట్రం నుంచి ఒక రెడ్డి సుప్రీంకోర్టులో తప్పనిసరిగా లేరా? ఈ ఆనవాయితీ ఎప్పుడయినా తప్పిందా?

వీళ్ళంతా అయోగ్యులనీ కేవలం కులం వల్లనే సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ఎంపిక అయ్యారనీ అనడం లేదు. ప్రస్తుత న్యాయవ్యవస్థ అవసరాల పరిధిలో ఎక్కువ భాగం యోగ్యులే కావచ్చు. కానీ యోగ్యతకు కులం కారణం కాదని వాళ్ళు సహితం ఒప్పుకుంటారు కాబట్టి కొన్ని కులాలలో మాత్రమే ఇది ఎందుకుంది అన్న ప్రశ్న వేసుకోనక్కరలేదా? అవకాశాలతో దానికి సంబంధం ఉందనీ, అవకాశాల కలిమికీ లేమికీ కులంతో సంబంధం ఉందనీ నిర్ధారించడం సమంజసంగా ఉండదా? అందరికీ సవాళ్ళు విసిరే సుప్రీంకోర్టు తనకు తాను ఈ సవాలు ఎందుకు వేసుకోదు?

దేశంలో ముస్లింల స్థితిగతుల మీద రాజేందర్ సచార్ కమిటీ సమర్పించిన నివేదిక మీద రివ్యూ ఈ బులెటిన్‌లో ప్రచురించాలనుకున్నాము గానీ దానికి విడిగా ఒక ప్రచురణ తీసుకురావడం ఉచితంగా ఉంటుందన్న అభిప్రాయంతో విరమించు కున్నాము. నిరాదరణకు గురైన సామాజిక వర్గంగా ముస్లింలు ఒక హక్కుగా పొంద వలసినవన్నిటికీ 'బుజ్జగింపు' అన్న నిందను తగిలించి జరగవలసిన న్యాయం జరగ కుండా అడ్డుపడుతున్న సంఘపరివార్ నోరు మూయించే సామర్థ్యం గల కృషి చేసి నందుకు రాజిందర్‌సచార్‌గారికి అభినందనలు.

**20 మే, 2007** **మానవహక్కుల వేదిక**